క్లుప్తంగా

ఆస్పరిలో ఫ్లాగ్ మార్చ్



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

ఆస్పరి: ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు గురువారం ఆస్పరి సీఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో మండలంలోని ఆస్పరి, నగరూరు, హలిగేర, బిల్లేకల్లు, ముత్తుకూరు, వలగొండ గ్రామాలలో స్థానిక పోలీసులతో కలిసి కేంద్ర సాయుధ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడా అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి గ్రామంలో ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని పార్టీల ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు.

పశువులకు బీమా సదుపాయం

తుగ్గలి: పాడి పశువులకు పెంపకందారులు బీమా చేసుకోవాలని తుగ్గలి పశువైద్యాధికారిణి ఎస్.ప్రణీత తెలిపారు. ఆమె గురువారం మాట్లాడుతూ.. ఆవు, గేదె, ఎద్దులకు రూ.30 వేల బీమా కోసం మూడేళ్లకుగాను రేషన్‌కార్డులు కలిగిన వారు రూ.384, కార్డు లేకపోతే రూ.960, నాటు పశువులకు రూ.15 వేల బీమా కోసం కార్డు కలిగిన వారు రూ.192, లేనివారు రూ.480 ప్రీమియం చెల్లించాలన్నారు. గొర్రెలు, మేకలకు రూ.6 వేల బీమా కోసం ఏడాదికి రూ.38, రేషన్ కార్డు కలిగిన వారు మూడేళ్లకు రూ.75, కార్డు లేనివారు రూ.187 ప్రీమియం చెల్లించాలని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నివాళులు



లలితమ్మ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర: గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం ఎమ్మెల్యేలు వెంకటరామిరెడ్డి, సాయిప్రసాద్ రెడ్డి, బాలనాగిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డిల మాతృమూర్తి ఎల్లారెడ్డి గారి లలితమ్మ చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలుసుకున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గురువారం అనంతపురం జిల్లా వజ్రకరూర్ మండలం కొనకొండ్ల గ్రామానికి వెళ్లి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈమె వెంట మద్దికెర జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి ఉన్నారు.

18 నుంచి ఒంటిపూట బడులు

తుగ్గలి: మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు ఈనెల 18వ తేదీ నుంచి ఒంటి పూట బడులు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈఓ–2 రామవెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాత్రమే బడి నిర్వహించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారన్నారు.

ఇన్‌చార్జ్ కార్యదర్శిగా సంజప్ప



మద్దికెర: ఎం.అగ్రహారం కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సంజప్పకు మద్దికెర మేజర్ పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు సర్పంచ్ సుహాసిని, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు గురువారం తెలిపారు. గతంలో ఈఓగా పనిచేస్తున్న శ్రీహరి ఈఓఆర్డీగా పదోన్నతి రావడంతో కోవెలకుంట్లకు బదిలీపై వెళ్లారు. ఇక్కడే పనిచేస్తున్న ఈఓఆర్డీ మద్దిలేటిస్వామికి ఇన్‌చార్జి కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. అయితే మద్దిలేటి స్వామి వ్యక్తిగత పనుల నిమిత్తం దీర్ఘకాలికసెలవుపై వెళ్లడంతో సంజప్పను ఇన్‌చార్జ్‌గా జిల్లా పంచాయతీ అధికారులు నియమించినట్లు వారు తెలిపారు.

అగ్రవర్ణ పేదలకు ఆర్థిక సాయం

తుగ్గలి: ఈబీసీ నేస్తం పథకం ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అగ్రవర్ణాల్లోని పేద మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తోంది. మండలంలో 291 మంది లబ్ధిదారులకు మూడో విడత సాయం రూ.43.65 లక్షలను వారి బ్యాంకు ఖాతాల్లో గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి జమ చేశారు. ఇన్‌చార్జ్ ఈఓపీ ఆర్డీ గోపాల్ మాట్లాడుతూ..ప్రభుత్వం అందించినసాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో బెంగళూరు వాసి దుర్మరణం

తుగ్గలి: పత్తికొండ – గుత్తి రహదారిపై మదనంతపురం బస్‌స్టేజి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందారు. బెంగళూరుకు చెందిన కార్తీక్ (26) మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనానికి బైక్‌కు వచ్చారు. దర్శనం అనంతరం తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో గిరిగెట్ల – జొన్నగిరి గ్రామాల మధ్య మదనంతపురం బస్‌స్టేజి సమీపంలో ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా గుత్తి నుంచి ఆదోని వైపు వెళుతున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. సంఘటన స్థలంలో లభించిన ఆధారాలతో మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

ముందస్తు కసరత్తు

- ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు
- నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాలు.. 2,56,315 మంది ఓటర్లు
- 66 సమస్యాత్మక గ్రామాలుగా గుర్తింపు



ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూంలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన (ఫైల్)

ఆలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఆలూరు నియోజకవర్గ ఎన్నికల యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ పనుల్లో ఎన్నికల రిటర్నింగ్ అధికార యంత్రాంగం తలమునకలై ఉన్నారు. ఎన్నికల నిబంధల మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు.

➡ ఎన్నికల ఏర్పాట్లలో నియోజకవర్గ యంత్రాంగం వేగం పెంచింది. ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో ముందస్తు చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఈవీఎంలు, వీవీ ప్యాట్ల తనిఖీలు పూర్తి చేశారు. ఈవీఎంలను భద్రపరిచే గోదాములను పరిశీలించారు. కొత్త ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. ఏ సమయంలో ఎన్నికల షెడ్యూల్ వచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియపై నివేదికలు కలెక్టర్‌కు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

294 పోలింగ్ కేంద్రాలు.. 2,56,315 మంది ఓటర్లు

ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆరు మండలాల పరిధిలో మొత్తం 2,56,315 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,28,718 మంది, మహిళలు 1,27,545 మంది 52 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. ఇప్పటికే అన్ని పోలింగ్ కేంద్రాలలో కల్పించాల్సిన మౌలిక వసతులపై నివేదికలను తయారు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

➡ అలాగే 2014, 2019 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని 66 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. పోలింగ్ జరిగే రోజు ఈ కేంద్రాల వద్ద పోలీసు భద్రత, వెబ్ కాస్టింగ్‌తో పాటు ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. ఇప్పటికే పోలీసు అధికారులు నియోజకవర్గానికి కావాల్సిన భద్రత సిబ్బంది వివరాలు సైతం ఉన్నాధికారులకు పంపించారు.

సెక్టోరల్ అధికారులు కీలకం

32 మంది సెక్టోరల్ ఆఫీసర్లతో నియోజకవర్గంలోని 294 పోలింగ్ కేంద్రాల నిర్వహణ, ఆ కేంద్రాల్లో కనీస వసతుల కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల ప్రక్రియ జరిగే మూడు రోజులు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లను ప్రభావితం చేయడం, ఓటు వేసే వారికి ఇబ్బంది కలిగించే వారిపై నిఘా ఉంచనున్నారు. ప్రతి సెక్టోరల్ అధికారికి ఓ పోలీసు సెక్టోరల్ అధికారిని నియమించారు. జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి పోలింగ్ కేంద్రాల బీఎల్‌ఓల వరకు కమ్యూనికేషన్ ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. అలాగే ప్రతి పోలింగ్ కేంద్రానికి ర్యాంపులు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యంతో పాటు వివిధ రకాల సౌకర్యాలు ఉండేలా చర్యలు చేపట్టారు.

ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఆరుగురు

పోలింగ్ పర్సన్ ప్రక్రియ పకడ్బందీగా చేపడుతున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న పోలింగ్ స్టేషన్‌లలో ఒక్కొక్క కేంద్రానికి ఆరుగురు చొప్పున పోలింగ్ సిబ్బందిని నియమించనున్నారు. మొత్తం 1,164 మంది సిబ్బంది అవసరమవుతారని ప్రాథమిక నివేదికల్లో పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు



ప్రతి పోలింగ్ కేంద్రంలో వసతులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ముందస్తుగా కసరత్తు చేయడం జరుగుతోంది. క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి వసతులు పరిశీలిస్తున్నాం. ప్రతి ఓటరు స్వేచ్ఛగా ఓటు వేసే వెసులుబాటు కల్పిస్తాం.

– రామునాయక్, ఈఆర్వో, ఆలూరు.

వివాహితపై అత్యాచారయత్నం

కృష్ణగిరి: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామంలో బుధవారం ఓ వివాహితపై ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మహిళ రాత్రి తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో చాకలి నరసింహుడు లోనికి ప్రవేశించి ఆమెతో అసభ్యకంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గురువారం నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీమా తక్షణ సాయం అందజేత

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి బీసీ కాలనీలో కురువ పక్కీరప్ప అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. మృతుడి పేరిట వైఎస్సార్ బీమా నమోదై ఉండడంతో సర్పంచ్ కారుమంచి మల్లికార్జున, గ్రామ కార్యదర్శి సుధాకర్ తక్షణసాయం కింద అతని భార్య పద్మావతికి రూ.10 వేలు అందించారు. మిగతా సొమ్ము త్వరలో నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు.

సభ విజయవంతంపై హర్షం

గోనెగండ్ల: రానున్న ఎన్నికల్లో ఎమ్మిగనూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయం అని ఆ పార్టీ నాయకుడు టీ.నాగేష్‌నాయుడు స్పష్టం చేశారు. గురువారం గోనెగండ్లలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బుధవారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. నాయకులు మురళి నాయుడు, తాయప్ప, కురువ లింగన్న, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.



అల్లుగుండులో ఇంటింటికీ కుళాయి పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

సంక్షేమం, అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ధ్యేయం

- వెల్దుర్తి మండలంలో రూ.1.37 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- ఎస్సీల సీలింగ్ భూములకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల పంపిణీ

వెల్దుర్తి(కృష్ణగిరి): పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడేలా నవరత్నాలు, మరెన్నో సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేసి, వాడలు మొదలుకుని మహానగరాల వరకు రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి చేసి చరిత్ర సృష్టించిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఆమె గురువారం వెల్దుర్తి మండల పరిధిలోని అల్లుగుండు, బింగిదొడ్డి గ్రామాలలో రూ.కోటి ముప్పైఏడు లక్షల విలువ గల అభివృద్ధి పనులను ప్రారంభించారు. అల్లుగుండులో రూ.10 లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్లు, రూ.39 లక్షలతో పూర్తి చేసిన ఓహెచ్‌ఎస్‌ఆర్, ఇంటింటికీ కుళాయి పథకాన్ని గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీరాంరెడ్డితో కలిసి ప్రారంభించారు. గ్రామంలో 34 మంది దళితులు ఏళ్లుగా సాగుచేసుకుంటున్న సీలింగ్ ల్యాండ్‌కు సంబంధించి ప్రభుత్వం రిజిస్టర్ చేసి ఇచ్చిన పత్రాలను అందించారు. అనంతరం బింగిదొడ్డి గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.23.95 లక్షలతో నిర్మించిన ఆర్బీకే, రూ.20.80 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్‌ను సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి దంపతులతో కలిసి ప్రారంభించారు. ఆయా గ్రామస్తులు ఎమ్మెల్యేకు గజమాలలు, పూలబాటతో స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కంగాటి రామ్మోహన్ రెడ్డి, వెల్దుర్తి మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న, పీఆర్ డీఈ రమేశ్‌బాబు, వెంకట్‌నాయుడు, కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి, మాలిక్ బాష, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సురేంద్రనాథ్ రెడ్డి, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

వెల్దుర్తి(కృష్ణగిరి): విధి రాత బాగోలేక ఆరోగ్య శ్రీ సైతం వర్తించని అనారోగ్య బాధితుల చికిత్స నిమిత్తం, అలాగే చికిత్స చేయించుకుని ఆర్థికంగా నష్టపోయిన వారికి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. ఆమె గురువారం వెల్దుర్తి ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని 22 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.56 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా అవసరమైన ప్రతి ఒక్కరికీ తనవంతుగా సీఎం సహాయనిధి కింద నిధుల మంజూరుకు కృషి చేస్తున్నానన్నారు. లబ్ధిదారులైన ఉపాధ్యాయురాలు కృష్ణవేణి భావోద్వేగంతో మాట్లాడుతూ.. తన భర్త ఉపాధ్యాయుడైన వెల్దుర్తి శేషారెడ్డి అనారోగ్యానికి గురై రూ.లక్షలు ఖర్చు చేసినా కోలుకోలేకపోయాడన్నారు. ఈ విపత్కర పరిస్థితులలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తమ కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని సీఎం సహాయనిధి ద్వారా రూ.13 లక్షలు మంజూరు చేయించడం ఎంతో ఆసరా ఇచ్చిందన్నారు. అలాగే వెల్దుర్తి మాజీ సర్పంచ్ ఆవుల భారతి మాట్లాడుతూ.. తన భర్త వెంకటేశ్వర్లుకు లివర్ సంబంధిత వ్యాధి సోకడంతో చికిత్స కోసం రూ.15లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని అందించడం పట్ల సీఎంకు, ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న, వెంకట్‌నాయుడు, మాధవస్వామి, చక్రపాణిరెడ్డి, ఖాజావలి తదితరులు ఉన్నారు.

చేసిన మేలును వివరిద్దాం

గోనెగండ్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు బందెనవాజ్, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగరాజు సూచించారు. గురువారం గోనెగండ్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గ్రామస్థాయి బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చేసుకుని కార్యకర్తలందరూ పనిచేయాలన్నారు. ప్రతి గడపకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను, ఆ కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించాలన్నారు. కన్వీనర్ దొరబాబు, నాయకులు చికెన్ రాజా, నదిముల్లా, వెంకట్ రెడ్డి, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యం

కృష్ణగిరి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా కృషి చేయాలని పార్టీ జిల్లా యువజన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి పిలుపునిచ్చారు. ఆయన గురువారం చుంచుఎర్రగుడి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తూ మద్దతు సేకరించారు. ప్రజల అనుమతితో ఇళ్లకు సిద్ధం స్టిక్కర్లను అతికించారు. అలాగే అన్ని గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. నాయకులు జయరామిరెడ్డి, సుంకన్న, హుసేన్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



సిద్ధం పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గీతాంజలి మృతికి కారకులను శిక్షించాలి

పత్తికొండ రూరల్: తెనాలికి చెందిన గీతాంజలి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని విశ్వబ్రాహ్మణ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కమ్మర హరికృష్ణ డిమాండ్ చేశారు. గురువారం పత్తికొండలోని నాలుగు స్తంభాల కూడలిలో విశ్వబ్రాహ్మణులు కొవ్వొత్తులతో గీతాంజలి చిత్రపటానికి నివాళులర్పించారు. టీడీపీ–జనసేన శ్రేణుల రాజకీయ వేధింపులకు పేదింటి మహిళ బలైందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు ఆనంద్‌ఆచారి, మహానంది ఆచారి, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: గీతాంజలి మృతికి కారణమైన వారిని శిక్షించాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు జనార్దన్ నాయుడు కోరారు. ఆడపిల్లల గౌరవ ప్రతిష్టలకు, మర్యాదలకు భంగం కలిగించే ఏ ఒక్కరినీ వదిలిపెట్టరాదని డిమాండ్ చేశారు.

పట్టణాభివృద్ధికి పక్కా ప్రణాళిక



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పక్కా ప్రణాళిక ప్రకారం పట్టణాభివృద్ధికి తనవంతు కృషి చేసినట్లు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలోని ఎంబీ చర్చి వద్ద కలుగొట్ల ప్రధాన రహదారిలో రూ.40 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు మున్సిపల్ కమిషనర్‌తో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని వార్డుల్లో పార్టీలకతీతంగా సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. మంచినీటి సమస్య పరిష్కారానికై ఏఐఐబీ స్కీం కింద రూ.142 కోట్లతో జీడీపీ నుంచి నీటిని పంపింగ్ చేసే పనులు కొనసాగుతున్నాయని, పనులు పూర్తయితే పట్టణానికి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఆయా పనులు సత్వరం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని ఆమేరకు అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కదిరికోట దేవరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి దొరబాబు, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ పల్లవి రాజశేఖర్, సందీప్‌కుమార్, ఎస్.ప్రభాకర్, శాంతిరాజు, ఎం.ప్రభాకర్, మాబాషా షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

➡ అలాగే పట్టణంలోని 15వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.16 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి కౌన్సిలర్ ఇషాక్, డీఈ నీరజ, ఏఈ శరత్‌చంద్ర భూమి పూజ చేశారు. అదేవిధంగా 27, 29 వార్డుల్లో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణానికి డీఈ మనోహర్‌రెడ్డి, 32వ వార్డు ఈద్గా మసీదు లైన్‌లో సాధారణ నిధులు రూ.4.5 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్, లక్ష్మీపేటలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.8.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి కౌన్సిలర్ పద్మ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్ తెర్నెకల్ సురేందర్ రెడ్డి తదితరులు

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో నాడు–నేడు పథకం కింద మంజూరైన ప్రాథమిక వైద్య కేంద్రం (పీహెచ్‌సీ)కి గురువారం భూమిపూజ చేశారు. పీహెచ్‌సీకి రూ.2 కోట్లు మంజూరు కాగా రూ.1.5 కోట్ల టెండర్ వర్క్‌కు అనుమతి లభించింది. కుల మతాలకు అతీతంగా క్రైస్తవ, ముస్లిం, హిందూ సంప్రదాయాలతో భూమిపూజ చేయించారు. జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ తెర్నెకల్ సురేంద్రరెడ్డి, గ్రామ సర్పంచ్ మొగతాల్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. సీఎం జగనన్న గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రిని నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. విద్య, వైద్యంకు ఎనలేని ప్రాధాన్యతనిస్తున్నారని వివరించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అతాఉల్లా, నాయకులు లుముంబా, సులోచనమ్మ, బెల్ ఈరన్న, నామాల శ్రీను, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఐ మహమ్మద్ రిజ్వాన్

చిప్పగిరి: మండలంలో గురువారం నిర్వహించిన ఆకస్మిక దాడులలో.. రెండు ద్విచక్ర వాహనాలలో కర్ణాటక నుంచి చిప్పగిరికి అక్రమంగా మద్యం తరలిస్తున్న చిప్పగిరికి చెందిన ధనుంజయ్య, సతీష్, రవి, పవన్ కల్యాణ్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు. నిందితుల నుంచి 2,880 హైవార్డ్ విస్కీ (90 ఎంఎల్) మద్యం టెట్రా ప్యాకెట్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పోలీస్ సిబ్బంది యశ్వంత్, రామోజీ, భాస్కర్ షబ్బీర్, అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తీసుకొచ్చి గజ్జహళ్లి గ్రామంలో విక్రయించేందుకు వాముదొడ్డిలో నిల్వఉంచిన రెండు మద్యం బాక్సుల (192 టెట్రా ప్యాకెట్ల)ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు గురువారం విలేకరులకు తెలిపారు. మద్యం విక్రేత పరారీలో ఉన్నాడని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

నేటి నుంచి బడేసాహెబ్ స్వామి ఉరుసు

గోనెగండ్ల: భక్తుల పాలిట కొంగు బంగారం గంజిహళ్లి బడేసాహెబ్ స్వామి ఉరుసు శుక్రవారం నుంచి ఘనంగా నిర్వహించనున్నారు. 15న స్వామివారి గంధం, 16న ఉరుసు, 17న జియారత్ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశామని, గ్రామానికి చేరుకునేందుకు ఎమ్మిగనూరు, గోనెగండ్ల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు వెల్లడించారు.

రమణీయం.. మహా రథోత్సవం



ఎర్రకోటలో స్వామి మహా రథోత్సవం



గూళ్యంలో పూజలందుకుంటున్న గాదిలింగేశ్వర స్వామి

హాలహర్వి: గురుశిష్యులైన సిద్దేశ్వర, గాదిలింగేశ్వర స్వాముల జోడు రథోత్సవం గురువారం భక్తుల జయజయ ధ్వనుల మధ్య రమణీయంగా సాగింది. ఈ సందర్భంగా గూళ్యం గ్రామంలో ఉదయం నుంచి సిద్దేశ్వర స్వామి, గాదిలింగేశ్వర వారికి జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి, పంచామృతాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనార్థమై తరలివచ్చారు. భక్తులకు అన్నదానం, మంచినీరు, వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

సాయంత్రం 6 గంటలకు కదిలిన రథచక్రాలు

భక్తుల జయజయ ధ్వనుల మధ్య సాయంత్రం 6 గంటలకు గాదిలింగేశ్వర స్వామి ఆలయం నుంచి గురుశిష్యుల జోడు రథాలు ముందుకు కదిలాయి. భక్తులు రథాలపై అరటి పండ్లు, పూలను విసురుతూ భక్తిని చాటుకున్నారు. అలాగే గొరవయ్యల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ కమిటీ చైర్మన్ బజారప్ప, ఎస్‌ఐ నరేంద్ర ఆధ్వర్యంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు.

దాతల అన్నదాన కార్యక్రమాలు

నిట్రవట్టి గ్రామస్తులు బాపురం నుంచి గూళ్యంకు వెళ్లే రహదారిలో భక్తులకు అన్నదానం, మజ్జిగ, మంచి నీటిని అందిస్తూ ఆకలి తీర్చారు. ఏటా రథోత్సవానికి హాజరయ్యే భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు వారు చెప్పారు. వైఎస్సార్సీపీ నాయకులు చంద్రశేఖర్, మండల కో–కన్వీనర్ మల్లికార్జున, యూత్ నాయకులు గంగాధర, గోపాల్, వ్యూరప్ప, వంశీ తదితరులు భక్తులకు వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

వైభవంగా మహాలింగేశ్వర స్వామి రథోత్సవం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట గ్రామంలో గురువారం సాయంత్రం మహాలింగేశ్వరస్వామి రథోత్సవం కనులపండువగా జరిగింది. ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రథంపై స్వామిని ఆశీనులు చేయడంతో రథం ముందుకు కదిలింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

సంజీవ రాయుడి రథోత్సవం



జూటూరులో రథాన్ని లాగుతున్న భక్తులు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని జూటూరు గ్రామంలో సంజీవరాయుడి రథోత్సవం గురువారం వైభవంగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఐ మురళీమోహన్ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఓబులేసు స్వామి కల్యాణ వైభోగం



ఓబులేసు స్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహించిన గ్రామ పెద్దలు

ఆస్పరి: మండలంలోని తొగలుగల్లు గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన ఓబులేసుస్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మిల కల్యాణోత్సవం గురువారం కనులపండువగా జరిగింది. ఆలయంలో పూజారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు గంగపూజ, పంచామృతాభిషేకం, పల్లకీ సేవ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవం తరువాత గ్రామంలో ఉత్సవ విగ్రహాలను భక్తులు ఊరేగించారు. మండలంలోని ఆస్పరి, తంగరడోణ, యాటకల్లు, దొడగొండ, బైలుపత్తికొండ, కైరుప్పల, డీకోటకొండ తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున స్వామివారి పల్లకీ ఊరేగింపు, ప్రభోత్సవం జరగనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.